


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 01, 2026 సంపుటి : 2 సంచిక : 290 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి

- టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత
- డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ

» స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు

» అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూలై31 :**
టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.
విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

» చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

» అభిమాన నాయకుడు మరణంతో విషాదం



**వరంగల్,జూలై31 :**
తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు.

మిగతాద్ది 2 లో



## తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం
- పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత

**హైదరాబాద్,జూలై31**
పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు.

మిగతాద్ది 2 లో

## తెలంగాణలో ఫ్యామిటీ సర్టిఫికెట్ జారీని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి




**హైదరాబాద్,జూలై31 :**
తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.



## హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

- అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్,జూలై31 :**
తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతాద్ది 2 లో




## నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరైన కెటిఆర్

» ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

**హైదరాబాద్,జూలై31 :**
ఫార్ములా-ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు.

## రాష్ట్రానికి డీఏపీ ఎరువుల సరఫరాను పెంచండి

» కేంద్రాన్ని కోరుతూ మంత్రి జెపి నడ్డాకు తుమ్మల లేఖ



**హైదరాబాద్,జూలై31 :**
రాష్ట్రానికి డీఏపీ ఎరువుల సరఫరాను పెంచాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో రైతులకు డీఏపీ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన్ని మంత్రి తుమ్మల కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. ఆగస్టుకు 50 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ కేటాయించాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో మరో 50 వేల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని ఆ లేఖలో మంత్రి తుమ్మల వివరించారు. డీఏపీ ఎరువుల డిమాండ్ భారీగా పెరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో డీఏపీ ఎరువుల వైపు రైతులు మొగ్గ చూపుతున్నారని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా సహకరించాలని కేంద్రానికి ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

మిగతాద్ది 2 లో




## తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

- మరో వారం రోజులు పొడిస్తూ ఇసి ఆదేశాలు
- ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి

**హైదరాబాద్,జూలై31 :**
కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.

## ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

- ఆగస్ట్ చివరలో నిర్మాణాలకు శ్రీకారం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**హైదరాబాద్,జూలై31 :**
ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ పక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు.

## నాణ్యమైన చేపల ఆహారాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యం

» ఫిష్ క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వహణ, పరిశుభ్రతపై సమీక్ష

» మాసబ్‌ట్యాంక్ ఫిష్ క్యాంటీన్‌ను సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్,జూలై31 :**
ఫిష్ క్యాంటీన్ సేవలను మరింత మంది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి దిశానిర్దేశం చేశారు. చేపలు అధిక ప్రోటీన్లు, పోషకాలు కలిగిన ఆహారమని, ప్రజలు చేపల వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. క్యాంటీన్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆదేశించారు.

మిగతాద్ది 2 లో

## తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

- అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం
- ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు

**హైదరాబాద్,జూలై31 :**
తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు.




## గోదావరి వరద ఉద్ధృతి

- ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం
- గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి
- ఖమ్మం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు




**హైదరాబాద్,జూలై31 :**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం సాయింత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

మొదటిపేజీ తరువాయి
హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి
ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఎ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ప్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.

# తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

మొదటిపేజీ తరువాయి
కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరైన కెటిఆం

మొదటిపేజీ తరువాయి
ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో ఊఓఆంకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఈఇక్ష కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కేటీఆర్ లక్ష పూచీకత్తు , 2 షూరిటీస్ సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

మొదటిపేజీ తరువాయి
గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది.అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

# తెలంగాణలో ఫ్యామిటీ సర్టిఫికెట్ జారీని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి

మొదటిపేజీ తరువాయి
ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు
అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి
ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ÷-లకెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని , అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత
ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ ప్రక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

# గోదావరి వరద ఉధృతి

మొదటిపేజీ తరువాయి
అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.
లాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రాజెక్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చినందున మూడవ ప్రమాదహెచ్చరిక జారీ చేశామని, ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చారు. 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు.

# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

మొదటిపేజీ తరువాయి
సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు.
ల్గ÷దరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.

# నాణ్యమైన చేపల ఆహారాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి మత్స్యశాఖ డైరెక్టర్ శ్రీమతి నిఖిల, అదనపు డైరెక్టర్ శ్రీ మురళీకృష్ణతో పాటు శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ క్యాంటీన్‌ను సందర్శించి, అక్కడి నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యత, వినియోగదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న చేపల వంటకాలు, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేపలు అత్యంత పోషక విలువలు కలిగిన ఆహారమని, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో చేపల వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఆహారాన్ని అందించాలని అధికారులను
ఆదేశించారు. రాష్ట్రంలోని మరింత మంది ప్రజలకు ఫిష్ క్యాంటీన్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, క్యాంటీన్‌ను మరింత ఆధునికంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

# డా. నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్

**- దేశానికే గర్వకారణం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు (వైద్యం), ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. దత్తాత్రేయుడు నోరికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను అమిత్ షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్య ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశార్గ÷లివలం ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే నిజమైన మౌన సాధకులకు, కర్మయోగులకు నేడు ఈ జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని ఆయన పేర్కొన్నారు.
రోగుల సంక్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం ఒక వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశ ప్రగతికి దిశానిర్దేశర చేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన శ్రీ అమిత్ షా... డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలం పాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం:

- **లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు**
- **ఇప్పటికే కంపెనీలకు పలుమార్లు నోటిసులు**
- **పురోగతి లేని కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం సిద్ధం.**
- **ప్రతి రైతుకు సకాలంలో మొక్కల పంపిణీ**
- **కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు.శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైందని, అంటే లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై అత్యంత నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున ఇప్పటికే పలుమార్లు కంపెనీలతో సమావేశాలు నిర్వహించి, ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని మంత్రి అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న సమయంలో కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోహియా కంపెనీకి, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాలలో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న తిరుమల కంపెనీకి, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రియూనిక్ కంపెనీకి, హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పనిచేస్తున్న రామ్ చరణ్ కంపెనీకి మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోద్రెజ్ కంపెనీకి రెండు సార్లు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విశ్వతేజ్ కంపెనీకి ఐదు సార్లు, కేన్ బయో కంపెనీకి ఆరు సార్లు, పతంజలి కంపెనీకి ఆరు సార్లు, మాట్రిక్స్ కంపెనీకి ఐదు సార్లు, సువేన్ ఆగ్రో కంపెనీకి మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపెనీలలో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ, కంపెనీలు ఇంకా బాధ్యతాయుతమైన వైఖరి కనిపించడంలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడిన ఏ కంపెనీ అయినా వారి పరిధిలోని జిల్లాలను తగ్గించడానికైనా లేక పూర్తిగా తొలగించడానికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని, అలాగే మెరుగైన పనితీరు కనబరిచే కంపెనీలకు మరికొన్ని జిల్లాలను అప్పగించే ఆలోచనకు ప్రభుత్వం సిద్ధం ఉందని అన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనుల్లో పురోగతి లేకుంటే ఆ సంస్థ పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు లేక కొత్త సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మొక్కల లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఎదురయ్యే అవకాశం ఉన్న కంపెనీలు ముందస్తుగా ఇతర కంపెనీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ల్గ÷తు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. యూనిట్ల ఏర్పాటులో జాప్యం కూడా ప్రభుత్వం సహించదని, ఇప్పటికే కావాల్సింత సమయం కంపెనీలకు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 01, 2026

# గుండ్లపోచంపల్లిలో అక్రమ నిర్మాణం

## పర్మిషన్ లేకుండా కడుతున్న కమర్షియల్ బిల్డింగ్

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

- గుండ్లపోచంపల్లి లో జైత్వాలా మహేంద్ర వర్మ అనే వ్యక్తి నిర్మిస్తున్న అక్రమ కట్టడం ఆపాలంటూ GHMC నోటీస్
- దశాబ్దాల క్రితం న్యాయంగా భూమి కొనుగోలు చేసినవారిపై అక్రమ కేసులు వేసి ఇబ్బంది పెట్టి, సెటిల్ మెంట్ పేరుతో స్వయం ఉపాధి సృష్టించుకున్న మహేంద్ర వర్మ అనే వ్యక్తిపై ఫిర్యాదుల వెల్లువ
- GHMC మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్, కుత్బుల్లా పూర్ జోనల్ కమీషనర్,సైబరాబాద్ మునిసిపల్ కమీషనర్ కార్యాలయాలలో పలు ఫిర్యాదులు
- గుండ్లపోచంపల్లి అభివృద్ధి చెందుతున్న ప్రాంతం.ఇక్కడ భూములకు విలువ పెరగడం వల్ల పని పాట లేని కొందరు వ్యక్తులు లిటిగేషన్ అవతారం ఎత్తి భూయజమానులపై లిటిగేషన్ లు సృష్టించి, కేసులు వేసి ఒత్తిడికి గురిచేసి కాంప్రమైజ్ అంటూ డబ్బులు దండుకునే లిటిగేషన్ వీరులు తయారయ్యారు.



**అందులో జైత్వాలా మహేంద్ర వర్మ ఒకరు అని గుండ్లపోచంపల్లి కి చెందిన వై.శ్రీకాంత్ అనే వ్యక్తి మీడియా తో అన్నారు.**

ఈ మహేంద్ర వర్మ అనే వ్యక్తి ఒకటి రెండు కేసుల్లో సెటిల్ మెంట్ పేరుతో డబ్బులు సంపాదించుకుని స్వయం ఉపాధి ఏర్పరచుకొని ఈ లిటిగేషన్ వృత్తిలో స్థిరపడ్డాడని గుండ్ల పోచంపల్లి కి చెందిన జి.శ్రీనాథ్ అనే వ్యక్తి కూడా కరపత్రం కు మహేంద్ర వర్మ అక్రమాల గురించి తెలియజేశారు.
సివిల్ కేసులు వేయడానికి కావాల్సిన అక్రమ ఆధారాలు సృష్టించి భూమి యజమానుల పై కేసులు వేయడం మహేంద్ర వర్మ అలవాటుగా మార్చుకున్నాడు.
గతంలో భూమి అమ్మినవారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి వారసుల సంతకాలు లేవు, పార్టిషన్ కాలేదు అని వారితో కేసులు వేయించడం ఇతని వృత్తి అని శ్రీకాంత్ అన్నాడు.
పైగా ఒక కేసులో అన్నదమ్ముల మధ్య పార్టిషన్ జరగలేదని కాబట్టి నా హక్కు నాకు ఇప్పించాలని 30 ఏళ్ల క్రితం అమ్మిన భూమిపై మేడ్చల్ కోర్టులో కేసు వేయించాడు.
ఒక కేసులో అన్నదమ్ముల మధ్య కుటుంబ సభ్యుల మధ్య 30 ఏళ్ల క్రితమే చట్టబద్ధంగా రిజిస్టర్ డాక్యుమెంట్ అయినప్పటికీ ఆ విషయాన్ని కప్పి పుచ్చి కేసు వేయించిన ఈ మహేంద్ర వర్మ వ్యవహారం గతంలో వెలుగు చూసింది.
ఆ కేసులో కొత్త కొనుగోలు దారుల పేర్లు పెట్టకుండా మొదటి కొనుగోలుదారుని పాత అడ్రస్ కు సమన్లు పంపించి,వేసవి సెలవుల కోర్టులో కోర్టు ద్వారా ఒక ఆర్డర్ తీసుకుని భూమి ని వివాదంలోనికి లాగడం ఇతని కుటిల వ్యవహారంగా మారింది.

**ఇటువంటి కేసుల్లో పిటిషనర్లకు ఆశలు కల్పించి, భూమి యజమానులకు అటార్నీగా కేసులు వేస్తాడు. అవతలి పార్టీ సెటిల్ మెంట్ కు వస్తే నీకు ఇంత డబ్బుకు ఇస్తాను అని,మీరు కోర్టుకు రావాల్సిన అవసరం లేదు,అంతా నాదే బాధ్యత అని పిటిషనర్లకు చెప్పి ఆటలాడుకోవడం ఇతని వ్యాపారంగా మార్చుకున్నాడు.**

ఏమీ తెలియని వారిని కేసులలో పిటిషనర్లుగా చేర్చి కేసులు వేయించి, అట్టి కేసుకు సంబంధించిన పేపర్ల లో తన పేరు, తన ఫోన్ నెంబరు వ్రాసి ప్రభుత్వ అధికారులకు సమర్పిస్తాడు.
వివాదాలు ఎందుకు అనుకున్న వారు ఈ ఫోన్ నంబర్ పై సంప్రదించి తనతో సెటిల్మెంట్లు చేసుకోవాలని తన ఫోన్ నంబర్ వ్రాస్తాడు.
అధికారులకు సమర్పించే బోగస్ వివాదాల పేపర్ల పైన పిటీషనర్ల కాంటాక్ట్ నంబరు వ్రాయడు.
కేసు వేసే పిటిషనర్ లను పావులుగా మార్చి సెటిల్మెంట్ చేసుకోవాలని ఇతని ఉద్దేశ్యం.

ఇలా పిటిషనర్ల వెనకాల చేరి ప్రాక్సీ గా,బినామీగా వ్యవహరిస్తాడు.
గతంలో ఒక కేసులో భూమికి నాలా కన్వర్షన్ అయిన విషయాన్ని...లే అవుట్ పర్మిషన్ తీసుకున్న విషయాన్ని దాచిపెట్టి ధరణి పోర్టల్ లో సర్వే నంబర్ తో ఉన్న పాత సమాచారం ఆధారంగా మహేంద్ర వర్మ ఒక అక్రమ కేసు వేయించాడని వై.శ్రీకాంత్ తెలిపాడు.

**గుండ్లపోచంపల్లి లో ఈ మహేంద్ర వర్మ బాధితులు చాలా మంది ఉన్నారని శ్రీకాంత్ అన్నాడు.**

ఇలా అక్రమార్జనకు అలవాటు పడిన మహేంద్ర వర్మ,అన్యాయమైన అక్రమ కేసులు వేయడాన్ని ఒక వృత్తిగా మార్చుకున్నాడని అన్నారు.
అక్రమార్కుడు మహేంద్ర వర్మ ఇప్పుడు గుండ్లపోచంపల్లి లో అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ ఇల్లు నిర్మిస్తున్నాడని శ్రీకాంత్ అన్నాడు.

సంబంధిత మునిసిపల్ శాఖ పర్మిషన్ లేకుండా మహేంద్ర వర్మ సర్వే నంబర్ 210 లో అక్రమ కమర్షియల్ ఇంటి నిర్మాణం చేపట్టాడు.

**మహేంద్ర వర్మ చేస్తున్న అక్రమ ఇంటి నిర్మాణం పై సంబంధిత GHMC అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లాయి.**

- **ఈ ఫిర్యాదుల ఆధారంగా జీహెచ్ఎంసీ అధికారులు మహేంద్ర వర్మ చేస్తున్న ఇంటి నిర్మాణ అనుమతులు ఉన్నాయా,ఉంటే మొత్తం వివరాలు సమర్పించవలసిందిగా షోకాజ్ నోటీస్ నం: 210/UC/TPS/ACP/C-60/QPZ/CMC/2026 ద్వారా తేదీ: 30 జూలై 2026 రోజు న నోటీస్ జారీ చేశారు.**

**అప్పటి వరకు నిర్మాణ పనులు ఆపాలని అధికారులు నోటీసు ద్వారా హెచ్చరించారు.**

ఈ నోటీస్ కు వచ్చే జవాబును బట్టి ఈ కమర్షియల్ నిర్మాణం వ్యవహారం తేలిపోతుంది అని వై.శ్రీకాంత్ మరియు శ్రీనాథ్ లు కరపత్రం కు తెలిపారు.
గుండ్లపోచంపల్లిలో ఇలా ఇంకొందరు పరాన్న జీవులు ఉన్నారని తెలిసింది.
పాత రికార్డులు వెదికి ఒక వివాదం సృష్టించి, సివిల్ కేసులు వేసి భూమి కొన్నవారిని సతాయించడం వృత్తిగా మార్చుకున్న ఇటువంటి వారిపై మునిసిపల్ అధికారులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు తగిన కట్టడి చేయాలని ప్రజలు బాధితులు కోరుకుంటున్నారు.
మహేంద్ర వర్మ పై వచ్చిన ఫిర్యాదుల గురించి,అతను చేస్తున్న కమర్షియల్ ఇంటి నిర్మాణం గురించి జిహెచ్ఎంసి కి తాము ఇచ్చిన ఫిర్యాదుల సహితంగా కరపత్రం కు వివరాలు సమర్పించారు.

**ఇది నా స్థలం ఎవడేం చేసుకుంటారో చేసుకోండి ...అంతా నా ఇష్టం..**అనే రీతిలో చెలరేగిపోతున్న మహేంద్ర వర్మ పై సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని శ్రీనాథ్,శ్రీకాంత్ తో కలిసి బి.రాజేశ్,సంతోష్, ఇ.మహేష్ తో పాటు కొందరు స్థానికులు అధికారులకు పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నారు.
మహేంద్ర వర్మ చేస్తున్న అక్రమ నిర్మాణం ను అధికారులు ఆపాలని శ్రీకాంత్,శ్రీనాథ్ లు బహిరంగంగా ప్రకటించారు.
ఈ మహేంద్ర వర్మ అక్రమ నిర్మాణాన్ని అన్ని మార్గాల్లో అడ్డుకుని తీరుతామని,
జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని,అవసరమైతే ప్రజల పక్షాన చట్ట సహాయం, న్యాయ సహాయం కోరుతామని శ్రీకాంత్ అన్నారు.

**మొత్తానికి అందరికీ శకునం చెప్పే బల్లి కుడితి కుండలో పడింది** అన్నట్టు...అందరిని ఇబ్బందులు పెట్టే అక్రమ ఫిర్యాదుల మహేంద్ర వర్మ స్వయంగా ఇబ్బందుల్లో పడ్డాడని శ్రీనాథ్,శ్రీకాంత్ తో పాటు గుండ్లపోచంపల్లిలో ప్రజల అభిప్రాయంగా వినిపిస్తున్నది.

# టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితను కలిసిన హనుమకొండ లీగల్ సెల్ కన్వీనర్ డాక్టర్ చింత రమాదేవి

- గ్రేటర్ వరంగల్‌లో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తాం – డాక్టర్ చింత రమాదేవి





**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూలై 31**
గ్రేటర్ వరంగల్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని హనుమకొండ జిల్లా టీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్, సీనియర్ న్యాయవాదులు డాక్టర్ చింత రమాదేవి అన్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షునిగా లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావును నియమించినందుకు టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు డాక్టర్ చింత రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలిసి గురువారం కల్వకుంట్ల కవితను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చింత రమాదేవి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే దిశగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత చూపిస్తున్న నాయకత్వం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పార్టీ చీఫ్ కవిత మార్గ దర్శకత్వంలో గ్రేటర్ వరంగల్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, యువత, మహిళలు, మేధావులు, న్యాయవాదులను పార్టీతో మరింతగా అనుసంధానం చేస్తూ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనే విధంగా సేవా కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ టీఆర్ఎస్‌ను ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ చింత రమాదేవి పిలుపునిచ్చారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఐ రాష్ట్ర నాయకులు వెంకట్రాములు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జులై 31**
నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలియజేశారు.వారి మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కరిగించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సమరంలో వారు నిర్వర్తించిన పాత్ర ఎనలేనిదన్నారు. ఉమ్మడి జిల్లా టిఆర్ఎస్ కన్వీనర్ గా, జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాన్ని సమన్వయంతో నిర్వహించడంలో, తెలంగాణ వాదులందరినీ ఏకం చేయడంలో, వారు ఎంతో నిబద్ధతతో కృషి చేశారన్నారు. నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో ముందు వరుసలో ఉన్నారని గుర్తు చేశారు. వివిధ రూపాలలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో అనేక సందర్భాల్లో వారితో కలిసి పని చేయడం జరిగిందన్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించారన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గ అభివృద్ధితోపాటు జిల్లా అభివృద్ధి కోసం అంకితభావంతో కృషి చేశారన్నారు. సమాజంలోని వివిధ సమస్యల పట్ల సామాజిక స్పృహతో స్పందించే పెద్ది మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది మరణం పట్ల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతల ఘన నివాళులు

- అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, జూలై 31**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం పట్ల న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు సమర్పించి పెద్ది సుదర్శన్‌రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం తెలంగాణ సమాజానికి, బీఆర్ఎస్ పార్టీకి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని పేర్కొన్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగ్, బొంగు అశోక్ యాదవ్, సీనియర్ నాయకులు చిన్న, దువ్వ కనకరాజ్, వేణు, పున్నం చందర్, పులి విక్రమ్, నరేష్, రాబర్ట్, పుల్లయ్య, వినయ్, రాజ్, కుమార్, నయీమ్ జుబేర్, ధీరజ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పాల్గొని పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

# తల్లిపాలే చిన్నారి తొలి హక్కు.. ఆరోగ్యవంతమైన తరాలకు అదే అమృతధార

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- హనుమకొండ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ – సంపత్ యాదవ్ పిలుపు

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, జూలై 31**
ప్రతి శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి ఆహారం, అమూల్యమైన వరమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ--సంపత్ యాదవ్ అన్నారు. ఆగస్టు 1న ప్రపంచ తల్లిపాల దినోత్సవం, ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు బంక సరళ – సంపత్ యాదవ్ మాట్లాడారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలు శిశువు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే అవగాహన కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఆరోగ్యవంత మైన భావితరాల నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని బంక సరళ-సంపత్ యాదవ్ పిలుపునిచ్చారు.

# ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తల్లిపాలే బలమైన పునాది

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి




**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, జూలై 31**
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, భావితరాల శ్రేయస్సుకు తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి అన్నారు. ఆగస్టు 1న ప్రపంచ తల్లిపాల దినోత్సవం, ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యంపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఎదగాలంటే కుటుంబ సభ్యులు, సమాజం కలిసి తల్లిపాల ప్రోత్సాహానికి తోడ్పడాలని సూచించారు. తల్లి, శిశు సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య సిబ్బంది నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో తల్లి, శిశు ఆరోగ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మనసారా ఆకాంక్షించారు.

# టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితను కలిసిన గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

- జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ వెంకటేశ్వర్ రావు.. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని వెల్లడి







**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 31**
తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినందుకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ శ్రేణులు, నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని పార్టీ చీఫ్ కవిత నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన మొదటి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి ప్రతి గ్రామం, ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని, అదే స్ఫూర్తితో ప్రజలకు అండగా నిలుస్తూ యువత, మహిళలు, మేధావులు, సామాజిక సేవకులను పెద్ద ఎత్తున పార్టీలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రేటర్ వరంగల్ జిల్లాలో పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను చేపడతామని, పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే తన ధ్యేయమని వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ.. లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు నాయకత్వంలో గ్రేటర్ వరంగల్ జిల్లాలో పార్టీ మరింత బలోపేతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి ఆయన అనుభవం, సామాజిక సేవా దృక్పథం దోహదం చేస్తాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలి
- ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికుల చైతన్య యాత్ర
- హనుమకొండలో బస్సు యాత్ర గోడపత్రికల ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, జూలై 31**
గీత కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన లక్ష్యంగా తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గీత కార్మికుల చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నయీంనగర్‌లో గీత కార్మికుల చైతన్య బస్సు యాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల సంక్షేమానికి స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న ఉపాధి, సంక్షేమం, భద్రత, జీవనోపాధి సంబంధిత సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల హక్కుల కోసం జీవితాలను అంకితం చేసిన నాయకులను స్మరించుకుంటూ, అమరుల ఆశయ సాధన కోసం ఈ చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ చైతన్య బస్సు యాత్ర కొనసాగుతుందని, గీత కార్మికులు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ యాత్ర ద్వారా గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా చైతన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రంజిత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోతి సాంబరాజు గౌడ్, కోలా ప్రతాప్ గౌడ్తో పాటు గీత కార్మికులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన భావితరాలకు తల్లిపాలే తొలి భరోసా

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**కరపత్రం ప్రతినిధి బ్యూరో,జూలై 31**
ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి తల్లిపాలే తొలి భరోసా అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఆగస్టు 1న ప్రపంచ తల్లిపాల దినోత్సవం, ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణ ప్రతి కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధ్యతగా భావించాలని సూచించారు.
తల్లి, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. తల్లిపాల ప్రోత్సాహానికి కుటుంబ సభ్యుల సహకారం కూడా అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేసి, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని డాక్టర్ కడియం కావ్య మనసారా ఆకాంక్షించారు.

# వరంగల్ న్యాయ మౌలిక వసతులపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- జిల్లా కోర్టుల అభివృద్ధి, ఈ-కోర్టుల విస్తరణపై కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ
- తెలంగాణకు మూడేళ్లలో రూ.11.16 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కేంద్రం వెల్లడి
- ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవల కోసం ఆధునిక మౌలిక వసతులు అవసరం : డాక్టర్ కడియం కావ్య



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 31**
వరంగల్ జిల్లాలో న్యాయ మౌలిక వసతుల అభివృద్ధి, ఈ-కోర్టుల విస్తరణ, కోర్టు భవనాల నిర్మాణం, డిజిటల్ న్యాయ సేవల పురోగతిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం, పూర్తయిన ప్రాజెక్టులు, అమలులో ఉన్న పనులు, ఈ-కోర్టుల అభివృద్ధి చర్యలపై స్పష్టమైన వివరాలను కోరారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లా, సబ్‌ఆర్డినేట్ కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి పై రాష్ట్రాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్రం 1993-94 నుంచి ప్రత్యేక కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణకు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.11.16 కోట్ల నిధులు విడుదల చేసి వినియోగించినట్లు కేంద్రం వెల్లడించింది. 2024-25లో రూ.1.96 కోట్లు, 2025-26లో రూ.9.20 కోట్లు విడుదల కాగా, 2026-27 సంవత్సరానికి రూ.15.79 కోట్ల మదర్ శాంక్షన్ మంజూరు చేసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయ సేవలు అందుబాటులోకి రావాలంటే ఆధునిక సాంకేతికతతో పాటు మెరుగైన మౌలిక వసతులు అవసరమని అన్నారు. ఈ-కోర్టుల ఫేజ్-3 కింద జిల్లాకు నిధులు మంజూరు చేసి డిజిటల్ సేవలను విస్తరించడం, ఈ-సేవా కేంద్రాల ఏర్పాటు, వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయాలు కల్పించడం వల్ల న్యాయ సేవలు మరింత ప్రజలకు చేరువవుతాయని చెప్పారు. జిల్లాలో కోర్టుల ఆధునికీకరణ, సాంకేతిక సదుపాయాల విస్తరణతో పాటు భవిష్యత్తులో అవసరమైన చోట కొత్త న్యాయ మౌలిక వసతుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ నిర్ణయం హర్షణీయం

- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించిన పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి
- హన్మకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 31**
తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆగస్టు 15 నుంచి సామాజిక భద్రతా పెన్షన్ అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని హన్మకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తలసేమియా, సికిల్ సెల్ బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిచ్చే చర్యగా నిలుస్తుందని అన్నారు. దీర్ఘకాలిక వైద్య చికిత్సలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఈ పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ నిర్ణయం అమలుకు సహకరించిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రి సీతక్కకు,ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, డిసిసి కమిటీకి వెంకట్రాం నరసింహారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని వెంకట్రాం నరసింహారెడ్డి పేర్కొన్నారు.

# హనుమకొండలో ఘనంగా ప్రారంభమైన జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

- హనుమకొండ ప్రజలకు మరింత చేరువైన ఆధునిక వైద్య సేవలు
- సేవాభావంతో వైద్య సేవలు అందించాలి: ఏసీపీ ప్రశాంత్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి హన్మకొండ/జూలై,30**
ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి సామాజిక బాధ్యత అని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు ముఖ్యఅతిథిగా ఏసిపి ప్రశాంత్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమానులు వి.మల్లేశం, వి.మల్లికార్జున్,ఎన్.సురేష్,ప్రదీప్,రూపేష్తో పాటు వైద్యులు, సిబ్బంది, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు,స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధికి విద్య, వైద్యం, వ్యవసాయం అనే మూడు రంగాలు ఎంతో కీలకమని, పేద ప్రజలకు మానవత్వంతో వైద్య సేవలు అందించాలని కోరారు. సేవా దృక్పథంతో ముందుకు వస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించడం ద్వారా భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని,ఒకరి ప్రాణాలను కాపాడడం కంటే గొప్ప పుణ్యకార్యం మరొకటి ఉండదని ఆయన పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆరోగ్యమే మనిషి జీవితానికి అసలైన సంపద అని,ఆరోగ్యం బాగుంటేనే విద్యను అభ్యసించగలమని, వ్యవసాయం చేయగలమని, కుటుంబాన్ని సంతోషంగా పోషించగలమని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధునిక వైద్య సదుపాయాలతో,నిపుణులైన వైద్యులతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ ఆసుపత్రి హనుమకొండతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించే కేంద్రంగా ఎదగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించాలని,తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి యజమాన్యం, కుటుంబ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుద్యాల రవీందర్‌కు ఘన వీడ్కోలు



**కరపత్రం ప్రతినిధి వరంగల్ జూలై 31**
వరంగల్: ప్రభుత్వ సహాయక భగవద్గీతా విద్యాలయం,వరంగల్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా,సంస్కృత ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన దుద్యాల రవీందర్ పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.జీహెచ్ఎస్ మట్వాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భగవద్గీతా విద్యాలయం,ప్రభుత్వ ఉన్నత పాఠశాల మట్వాడ ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొని రవీందర్ అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి,సంస్కృత భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా దుద్యాల రవీందర్‌ను శాలువాతో సత్కరించి,జ్ఞాపిక అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.పదవీ విరమణ అనంతరం కూడా విద్యా,సామాజిక రంగాలకు తన సేవలు కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు.

## ఇంటిలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ హత్య కేసు ఆప్ మాజీనేత తాహిర్ హుస్సేన్‌కు జీవితఖైదు

ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ అంకిత్ శర్మ హత్య కేసులో ఆప్ మాజీ నేత తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. 2020 నాటి ఢిల్లీ అల్లర్లలో అంకిత్ శర్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు అత్యంత అరుదైనదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అత్యంత క్రూరంగా ఈ హత్య జరిగిందని వ్యాఖ్యానించింది. హత్య తరువాత కూడా మృతుడిపై ద్వేషం తగ్గలేదని నేరం తీరు చూస్తుంటే అనిపిస్తోందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మృతదేహాన్ని ఈడ్చుకుంట తీసుకెళ్లి నాలాలో పడేశారని కోర్టు పేర్కొంది. అయితే, మూకదాడిలో భాగంగా ఈ హత్య జరగడం, ఘటన సమయంలో ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ శిక్ష ఖరారు చేసినట్టు కోర్టు పేర్కొంది. నాటి అల్లర్లల్లో కొందరు అంకిత్ శర్మపై కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశారు. మరుసటి రోజు ఉదయం మృతదేహం లభించింది. శరీరంపై 54 కత్తి పోట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో తాహిర్ కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. కోర్టు తీర్పుపై తాహిర్ లాయర్ స్పందిస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకుంటామని అన్నారు. తనకు న్యాయం కొంత ఆలస్యంగానైనా దక్కుతుందన్న నమ్మకం ఉందని తాహిర్ తెలిపాడు. ఢిల్లీ న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా కూడా ఈ తీర్పుపై స్పందిస్తూ తాహిర్‌కు యావజ్జీవం ఖరారు కావడంతో న్యాయం దక్కే దిశగా తొలి అడుగు పడిందని అన్నారు.